క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కర్నూలు(సెంట్రల్): స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లోని సుందరయ్య స్ఫూర్తి కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు భరత్, నాగభూషణరావు, హనీఫ్, తేజ హాజరై వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. బీపీ, షుగర్, పక్షవాతం, మూర్ఛలాంటి వ్యాధిగ్రస్తులకు కేవలం రూ.300లకే రెండు నెలలకు సరిపడే మందులను అందించారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం సభ్యులు రంగస్వామి, ఎన్.శేషయ్య పాల్గొన్నారు.

సేవా అవార్డు ప్రదానం



లయన్స్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకుంటున్న రామరాజు

కర్నూలు(అర్బన్): నగరానికి చెందిన ఎస్.వెంకటరామరాజు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఆదివారం నెల్లూరులో జరిగిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అవార్డుల ఉత్సవాల్లో ఆయనకు లయన్స్ క్లబ్ గవర్నర్ వై.నాగేశ్వరరావు అవార్డును అందించారు. రామరాజు మాట్లాడుతూ.. నగరంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టడం వల్ల తాను ఈ అవార్డుకు ఎంపికయ్యానన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. లయన్ క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్లు, రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం జారీపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎరుకల రాజు

కర్నూలు సిటీ: ఎస్టీ కానీ వారికి ఎస్టీ కమ్యూనిటీలోని ఎరుకల కుల ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసిన కొతాళం తహసీల్దార్ కె.మల్లికార్జున స్వామిపై చర్యలు తీసుకోవాలని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎరుకల రాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఎరుకుల హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఆయన ప్రసంగించారు. ఎస్సీ కమ్యూనిటీలోని మాదిగ కులానికి చెందిన నల్లగోడి శ్రీనివాసులుకు ఎస్టీ కమ్యూనిటీలోని ఎరుకుల కులం అని ధ్రువీకరణ పత్రం జారీ చేశారన్నారు. ఆదోనిలోని సదాపురం ఆది ఆంధ్ర పురపాలక ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తూ కుల ధృవీకరణ పత్రాల విషయంలో నల్లగోడి శ్రీనివాసులు సస్పెండ్ అయ్యారన్నారు. అయితే శనివారం కొతాళం తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్ఓ డబ్బులకు కక్కుర్తి పడి తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం జారీ చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

22 క్వింటాళ్ల బెల్లం స్వాధీనం

ఓర్వకల్లు: మండలంలోని పూడిచెర్ల మొట్టవద్ద జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న సారాకు వినియోగించే బెల్లం 2,240 కిలోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సునీల్ కుమార్ వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, జలౌన్ జిల్లాకు చెందిన దిల్షద్‌ఖాన్ బెల్లాన్ని తరలిస్తున్నట్లు సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో కలిసి పూడిచెర్ల బస్సుస్టేజీ వద్ద కాపుకాశారు. వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 2,240 కిలోల బెల్లం, సారా తయారీలో ఉపయోగించే 5 కిలోల నవసాగ్రాన్ని గుర్తించారు. గుడుంబాయి తండాకు చెందిన నెనావత్ వెంకటేశ్‌నాయక్‌ను పోలీసులు విచారించారు. అంగీకరించడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రాజగోపురానికి రూ.లక్ష విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ రాజగోపుర నిర్మాణానికి తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా వాస్తవ్యులు శ్రీదేవి, విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,00,001 విరాళం అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు.

శిశు గృహకు చిన్నపాప



కర్నూలు (టౌన్): కర్నూలు రైల్వే స్టేషన్‌లో ఆదివారం భిక్షాటన చేసే మహిళ వద్ద చిన్న పాపను (3) పోలీసులు గమనించారు. అనుమానం వచ్చి ఆరా తీశారు. ఆ మహిళా వద్ద నుంచి పాపను స్వాధీనం చేసుకొని పిల్లల సంరక్షణ కేంద్రానికి తరలించి విచారణ చేపట్టారు. లోకేష్ అనే ఆటో డ్రైవర్‌కు చెందిన పాపగా గుర్తించారు. లోకేష్ మానసిక జబ్బుతో బాధపడుతుండగా..ఆయన భార్య చనిపోయింది. మూడేళ్ల కూతురును స్థానిక రైల్వే స్టేషన్‌లో వదిలేయడంతో భిక్షాటన చేసే మహిళ వద్దకు చేరింది. పోలీసులకు చిన్న పాపను గమనించి శిశుగృహకు తరలించారు. తగిన ఆధారాలతో శిశు గృహానికి వెళ్లాలని లోకేష్ బంధువులకు సూచించారు.

డ్యూటీ డాక్టర్లు తప్పనిసరిగా ఉండాలి



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీ, ఏఎంసీ, పీడియాట్రిక్స్, గైనిక్ తదితర అత్యవసర విభాగాల్లో డ్యూటీ డాక్టర్లు సక్రమంగా ఉండటం లేదు. కొద్దిసేపు మొక్కుబడిగా వచ్చి వెళ్లిపోతున్నారు. డాక్టర్లకు కేటాయించిన సమయంలో అక్కడే ఉండి పీజీలు, ఎస్ఆర్‌లు, హౌస్ సర్జన్లకు సూచనలు, సలహాలు ఇవ్వాలి. కానీ వారు లేకపోవడం వల్ల మొత్తం భారమంతా సీనియర్ పీజీలపై పడుతోంది. ఈ కారణంగా వారు ఒత్తిడికి గురవుతున్నారు. ఇదే సమయంలో ఒకేసారి ఎక్కువ మంది రోగులు రావడం, అందరికీ ఒకే సమయంలో చూడలేకపోవడం కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సకాలంలో వైద్యం అందడం లేదంటూ కొందరు రోగుల సహాయకులు వైద్య విద్యార్థులతో ఘర్షణలకు దిగుతున్నారు. వీరితో పాటు ఇప్పుడు పీజీ సీట్లు వచ్చాయి కాబట్టి సూపర్ స్పెషలిస్టులకు కూడా అత్యవసర విభాగాల్లో డ్యూటీలు వేయాలి. వీరి అవసరం అత్యవసర రోగులకు ఎంతగానో ఉంటుంది. స్పెషలిస్టులు, సూపర్ స్పెషలిస్టులు అందుబాటులో ఉంటే క్యాజువాలిటీ లాంటి ప్రాంతాల్లో రోగులకు త్వరగా వైద్యం అందే అవకాశం ఉంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, రిటైర్డ్ డీఎంహెచ్ఓ, కర్నూలు



అమెరికాలో 24 గంటల కంటే ఎక్కువ పనిచేయనివ్వరు



కర్నూలు(హాస్పిటల్): అమెరికాలో అయితే డ్యూటీ డాక్టర్‌ను 24 గంటలకు మించి పనిచేయనివ్వరు. వెంటనే వారిని పంపించేస్తారు. కానీ ఇక్కడ 36 నుంచి 48 గంటల పాటు ఏకధాటిగా పనిచేయిస్తున్నారు. ఒక విధంగా జూనియర్ డాక్టర్లతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. వారికి సరైన వసతులు, సౌకర్యాలు ఉండటం లేదు. వాష్‌రూములు, రెస్ట్‌రూములు ఉండటం లేదు. ఫ్యాన్లు, తాగునీరు ఉండవు. నైట్ డ్యూటీ చేసే సమయంలో కొన్ని చోట్ల చీకటిగా ఉంటుంది. మహిళా జూనియర్ డాక్టర్లు ఎలా పనిచేస్తారు? జూనియర్ డాక్టర్లు అసిస్టెంట్ ప్రొఫెసర్లతో సమానంగా పనిచేస్తారు. వారికి మంచి జీతాలు ఇవ్వాలి. ప్రోత్సహించాలి. ఆర్ఎంఓలు తరచూ రాత్రివేళల్లో రౌండ్స్ వేస్తుండాలి. దీనివల్ల ప్రతి ఒక్కరికీ భయం ఉంటుంది. అందరూ విధుల్లో ఉంటారు. నైట్ డ్యూటీ చేసే వారికి తప్పనిసరిగా సెక్యూరిటీ కల్పించాలి.

– డాక్టర్ ఎ.వసంతకుమార్, కార్డియాలజిస్టు, కర్నూలు





● సిద్ధమవుతున్న గణనాథులు



వినాయకచవితి ఉత్సవాలకు గణనాథుల విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. పండుగ దగ్గరపడుతుండడంతో ఇప్పటికే తయారుచేసిన విగ్రహాలకు పెయింటింగ్, ఇతర తుదిమెరుగులు దిద్దే పనుల్లో కార్మికులు నిమగ్నమయ్యారు. వివిధ రూపాల్లో కళానైపుణ్యం ఉట్టిపడేలా కార్మికులు వినాయక విగ్రహాలను తయారుచేస్తున్నారు. బసవన్న, మూషికం, పల్లకీ, సింహాసనంపై గణేశుడితో పాటు దేవుళ్ల రూపాలు శివపార్వతులు, రాముడు, ఆంజనేయుడు, వేంకటేశ్వరస్వామి రూపాలతో భక్తులను ఆకట్టుకునేలా స్వామివారి విగ్రహాలను తీర్చుదిద్దుతున్నారు. ఆయా మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఇప్పటికే నిర్వాహకులు ఆర్డర్లు ఇస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఏటా ఘనంగా నిర్వహించే వినాయక చవితి పండుగకు విగ్రహాలను తయారుచేయడం ద్వారా తమకు ఉపాధి లభిస్తుందని కార్మికులు పేర్కొంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు





యువత సన్మార్గంలో నడవాలి

కర్నూలు (టౌన్): యువత సమయాన్ని దుర్వినియోగం చేయకుండా దైవభక్తితో సన్మార్గంలో నడవాలని కర్నూలు కళాశాల క్రిస్టియన్ యూత్ ఫెలోషిప్ సభ్యురాలు ఎస్.దివ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో 59వ యువజన ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూత్ సభ్యురా లు మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని సూచించారు. నిజ జీవితంలో మంచి ప్రవర్తనతో ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. యూత్ ఫెలోషిప్ సభ్యులు అక్రమన్ సామ్ విన్ని, డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, పాస్టర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి టీజీ భరత్‌కు వినతులు

కర్నూలు(సెంట్రల్): నిరుద్యోగ సమస్యపై మంత్రి వర్గంలో చర్చించాలని కోరుతూ ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మంత్రి టీజీ భరత్‌కు వినతి పత్రం సమర్పించారు. మంత్రి కార్యాలయంలో ఆయన్ను కలసి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని కోరారు. అలాగే బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఆవాజ్ కమిటీ నగర నాయకుడు ఎస్.అబ్దుల్‌సుబాన్, పి.ఇక్బాల్‌హుస్సేన్ మంత్రిని కోరారు. 19వ వార్డు పరిధిలోని జొహరాపురంలో కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వాయిదా

కర్నూలు (టౌన్): నగరపాలకలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కృష్ణాష్టమి పండుగ సెలవు సందర్భంగా వాయిదా వేసినట్లు కమిషనర్ రామలింగేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై మంగళవారం నుంచి కార్యాలయ పనివేళల్లో లేదా ప్రజా ఫిర్యాదుల స్వీకరణ విభాగం హెల్ప్‌లైన్ నంబర్ 74229 92299 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

సాంబశివయ్య నగర్‌లో చోరీ

కర్నూలు టౌన్: నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని సాంబశివయ్య నగర్‌లో ఆదివారం చోరీ జరిగింది. కాలనీకి చెందిన రమేష్ అనే వ్యక్తి ఆర్మీలో పనిచేస్తున్నాడు. బంధువులను చూసేందుకు వెళ్లిన సమయంలో దొంగలు తాళాలు పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించి మూడున్నర తులాల బంగారం, వెండి నగలను తీసుకొని ఉడాయించారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దొంగల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

29న వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

కర్నూలు కల్చరల్: తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ నెల 29న సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఉదయం 10.30 గంటల నుంచి ×దేశ భాషలందు తెలుగు లెస్స× అంశంపై పోటీలు ఉంటాయని చెప్పారు. వక్తృత్వ పోటీలో ఒక్కొక్కరికి 3 నిమిషాల వ్యవధి ఉంటుందని, ఎలాంటి ఆంగ్ల పదాలు వాడకూడదని, వ్యాసరచనకు గంట వ్యవధి ఉంటుందని మూడు పేజీలకు మించకుండా వ్యాసం రాయాలని పేర్కొన్నారు. ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 5 కన్సోలేషన్ బహుమతులను అదే రోజు సాయంత్రం 6 గంటలకు ప్రముఖుల చేతుల మీదుగా అందించనున్నట్లు వెల్లడించారు.

దేశ అభివృద్ధిలో యువత కీలకం



మారథాన్ రన్ విజేతలతో భూపతిరావు తదితరులు

కర్నూలు (టౌన్): దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు పేర్కొన్నారు. స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఆదివారం మినీ మారథాన్ పోటీ నిర్వహించారు. మైదానం నుంచి జగన్నాథ గట్టు వరకు మారథాన్ రన్‌ను డీఎస్ డీఓ ప్రారంభించారు. యువతీ, యువకులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. దేశానికి యువత ప్రాతినిధ్యం ఎంతో అవసరమన్నారు. క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలన్నారు. మినీ మారథాన్‌ను 20 నిముషాల్లో పూర్తి చేసిన క్రీడాకారులకు ఆయన కప్పులు, మెడల్స్ అందజేశారు. ఒలింపిక్ సంఘం కార్యదర్శి రామాంజనేయులు, న్యాయవాది శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

1న రైతాంగ డిమాండ్స్ డే



మాట్లాడుతున్న పంపన్నగౌడ్

కర్నూలు(సెంట్రల్): రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీన రైతాంగ డిమాండ్స్ డే నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, జిల్లా సమితి సభ్యుడు సురేంద్రయాదవ్ తెలిపారు. ఆదివారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తోందన్నారు. రైతులకు పంట రుణాలు, బీమా, సబ్సిడీపై విత్తనాలు, మందులు, ఎరువులు ఇవ్వాలన్నారు. పండిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలను కల్పించడంలో ప్రభుత్వాలు ఎందుకు తాత్సారం చేస్తున్నాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో కృష్ణానాయక్, మల్లికార్జున, అశోక్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



సందేశమిస్తున్న రఘునందన సేవక ప్రభు, పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇస్కాన్, గోదా గోకులం, సత్యసాయి మందిరంలో వేడుకలు అంబరాన్నంటాయి. గోమాత పూజ, ఉట్లోత్సవం నిర్వహించారు. చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలు, నృత్యాలు అలరించాయి. నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలోని రుక్మిణీ సమేత శ్రీకృష్ణ ఆలయంలో గోమాత పూజ, భజన, భగవద్గీత పారాయణం చేశారు. అర్ధరాత్రి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, లాలిపాటలు వైభవంగా జరిగాయి. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇస్కాన్ జగన్నాథ మందిరంలో జరిగిన గోకులాష్టమి వేడుకల్లో శుభమంగళ హారతి, దర్శన హారతి, హరినామ సంకీర్తన శ్రవణ కీర్తన మహోత్సవం జరిగాయి. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు సందేశమిచ్చారు. నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో వేదం, భజన కార్యక్రమాలు జరిగాయి.



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌మూర్తులు



సత్యసాయి మందిరంలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

రోడ్లు ఇలా.. రాకపోకలు ఎలా?



దిన్నెదేవరపాడు రోడ్డుపై ఏర్పడిన గుంతలు



బురదమయంగా ఉన్న నంద్యాల చెక్‌పోస్టు గౌతమినగర్ రోడ్డు

కల్లూరు: కల్లూరు అర్బన్ కాలనీలోని పలు రోడ్లు గుంతలమయంగా మారాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ గుంతల్లో నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కల్లూరు అర్బన్ 19వ వార్డులోని గౌతమీనగర్, 21వ వార్డులోని మహాలక్ష్మీనగర్, పార్థసారథి నగర్, 41వ వార్డులోని పలు కాలనీ రోడ్లు అధ్వానంగా మారాయి. అలాగే కర్నూలు నగరం సిల్వర్ జూబ్లీ కళాశాల నుంచి దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లే రోడ్డుతో పాటు సైనిక భవనం, గిరిజన గురుకుల పాఠశాల, మహాలక్ష్మీనగర్‌లోని రోడ్లపై గుంతలు ఏర్పడాయి. సిల్వర్ జూబ్లీ కళాశాల నుంచి సైనిక భవన్ వరకు ఉన్న రోడ్డు నెర్రలిచ్చింది. ఈ రోడ్లలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

వర్షమొస్తే చిత్తడే

ఈ రోడ్డు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు గౌతమినగర్‌లో ఉంది. వర్షం వస్తే రోడ్డు చెరువును తలపిస్తుంది. వాన నీరు, బురద కారణంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి. ధైర్యం చేసి కొందరు వెళ్లినా అదుపు తప్పి కింద పడిన ఘటనలు ఉన్నాయి. ఈ రోడ్డులో అనేక అపార్టుమెంట్లు, రెండు పాఠశాలలు ఉండడంతో విద్యార్థులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారి లేక చుట్టి వెళ్లాల్సిన పరిస్థితి. ఇదే ప్రాంతంలో నగర పాలక కమిషనర్ ఇల్లు ఉండడం.. ఈ మార్గంలోనే రాకపోకలు సాగించడం గమనార్హం.

28న భూబాధితుల సదస్సు

కర్నూలు(సెంట్రల్): ఆగస్టు 28వ తేదీన విజయవాడలో జరిగే భూబాధితుల సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సీఆర్ భవన్‌లో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలు ఇళ్ల స్థలాల కోసం తీసుకున్న వాటికి పట్టాలు ఇవ్వాలన్నారు. భూమి లేని పేదలకు రెండెకరాల భూమి ఇవ్వాలని కోరారు. నాయకులు పంపన్నగౌడ్, శ్రీనివాసరావు, మహేష్, అన్వర్, సోమన్న, ఆంజనేయులు, సోఫియా, భాస్కర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

● ఈ వార్డులో నడిస్తే మంచం ఎక్కాల్సిందే!



న్యూరోసర్జరీ విభాగం బాత్‌రూమ్‌లో పూర్తిగా దెబ్బతిన్న టైల్స్



న్యూరోసర్జరీ వార్డులో దెబ్బతిన్న టైల్స్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరోసర్జరీ విభాగంలో టైల్స్ (బండలు) దెబ్బతిన్నాయి. వార్డులో ఎక్కడో ఒక చోట కాదు, వార్డు మొత్తం అలాగే ఉన్నాయి. దీంతో ఈ విభాగంలో నిత్యం నడిచే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వారిని చూసేందుకు వచ్చిన బంధువులు బండల వల్ల గాయాలపాలయ్యారు. వార్డు బాత్‌రూమ్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. బండలు పూర్తిగా దెబ్బతిని నడవడానికి కూడా వీల్లేని విధంగా తాయారైంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

ఈత పోటీల్లో పతకాల పంట



ఓవరాల్ రన్నర్షిప్ టైటిల్‌ను అందుకుంటున్న కర్నూలు స్విమ్మర్స్

కర్నూలు కల్చరల్: బాపట్ల డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నరసరావుపేట ఎస్ఎస్ఎన్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన 10వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు స్విమ్మర్స్ ప్రతిభ కనబరిచారు. 8 గోల్డ్, 3 సిల్వర్, 7 బ్రాంజ్ పతకాలతో మొత్తం 18 మెడల్స్ సాధించి ఓవర్ ఆల్ రన్నర్షిప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. దేవ్‌కృత్ సాయి ఐదు గోల్డ్ మెడల్స్, డి.వెంకటేష్ 3 గోల్డ్, ఒక సిల్వర్ మెడల్, సామియా తస్లీమ్ రెండు సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్, మనోజ్ 3 బ్రాంజ్ మెడల్స్, ఫర్హాన్ ఒక బ్రాంజ్ మెడల్, భువనాదిత్య ఒక బ్రాంజ్ మెడల్ సాధించారు. దేవ్‌కృత్ సాయి ఐదు గోల్డ్ మెడల్స్ సాధించడంతో ఇండీజ్యువల్ ఛాంపియన్‌షిప్ టైటిల్ అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ అక్వాటిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వి.మోహన్ రామ్, పల్నాడు డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ సుబ్బారెడ్డి, బాపట్ల డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి నాగమురళి, పల్నాడు జిల్లా డీఎస్‌డీఓ జి.సురేష్, కర్నూలు స్విమ్మింగ్ పూల్ కోచ్ నటరాజ్ ఓవరాల్ చాంపియన్‌షిప్, ఇండిజ్యువల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను అందజేశారు.